బీజేపీ పాలనలో అక్రమాలపై కేబినెట్ సబ్ కమిటీ

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో కొనసాగిన అక్రమాలతో కలిపి 26 అవినీతి వ్యవహారాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉత్తర్వులు జా రీ చేశారు. కమిటీలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడ, ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే, కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్ సభ్యులుగా ఉంటారు. రెండు నెలల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం సూచించారు.



భద్ర ఎగువ ప్రాజెక్టు కాలువ

కేంద్రంపై పోరుకు.. సిద్ధం..!

- భద్ర గ్రాంట్ల కోసం 'సుప్రీం'కు..
- కరువుసాయం తరహాలోనే న్యాయపోరాటం
- కేంద్ర జలమంత్రిత్వశాఖ షరతులపై మంత్రుల ఆగ్రహం

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాజకీయంగా ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్ల సాధన కోసం కొత్తవ్యూహానికి తెరలేపిన కాంగ్రెస్ పెద్దలు.. మరోసారి అదే బాటలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు 2023 బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,300 కోట్ల విడుదలకు కొత్త షరతులు విధించడంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా గ్రాంట్లు విడుదల చేయకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని యోచిస్తోంది. ఇలా కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రం మరోసారి సంఘర్షణకు సిద్ధమవుతోంది. భద్ర ఎగువ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యాలయ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఈనెల 5న లేఖ పంపారు. అందులో కొన్ని అంశాలను ప్రస్తావించడం, మరిన్ని షరతులు విధించడంపై రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. భద్ర ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్థిక అంచనాలతో నివేదిక సమర్పించాలని లేఖలో సూచించారు. ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.9,713.28 కోట్లు ఖర్చు చేసింది. కేంద్రప్రభుత్వం రూ.5,300 కోట్లు విడుదల చేస్తుందనే భరోసాతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులు వెచ్చించింది. కొత్త షరతులు విధించడం ద్వారా మెలిక పెడుతోందని రాష్ట్ర ప్రభుత్వం మండిపడుతోంది. జలశక్తి కార్యదర్శి రాసిన లేఖ రాష్ట్రానికి ఆశనిపాతంగా మారింది. భద్ర ఎగువ ప్రాజెక్టు కోసం రాష్ట్రానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,300 కోట్లు విడుదల చేయకుండా వెనుకడుగు వేస్తున్నట్టు స్పష్టమవుతోందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మండిపడ్డారు. కేంద్రం సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తోందని ఏడాది కాలంలో పలు సందర్భాల్లో సీఎం సహా మంత్రులు విమర్శలు గుప్పించారు. బయలు సీమ జిల్లాలకు నీటి సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం గ్రాంట్ల విడుదల విషయంలో వెనుకడుగు వేస్తున్నారని మండిపడుతున్నారు. మహదాయి ప్రాజెక్టు విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ప్రస్తుతం భద్ర ఎగువ ప్రాజెక్టులోనూ గ్రాంట్ల కేటాయింపునకు నిబంధనలు విధించడం సమంజసం కాదని పలువురు మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా సుప్రీంలో పిటిషన్

బడ్జెట్‌లో ప్రకటించిన గ్రాంట్లను విడుదల చేయకపోతే రాష్ట్రం నుంచి రాజకీయంగా ఒత్తిడి తీసుకురావాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. సాధ్యం కానిపక్షంలో కేంద్రప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని సిద్ధమవుతున్నారు. కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై త్వరగానే సమగ్ర చర్చ జరపాలని నిర్ణయించారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాటం కొత్త కాదు. రాష్ట్రానికి జీఎస్టీ వాటాలో అన్యాయం జరుగుతోందని ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులంతా ఆందోళన చేసిన విషయం తెలిసిందే. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు కేబినెట్ మంత్రులు, ఎంపీలు నిరసన చేపట్టారు. తర్వాత 2023 అనావృష్టికి సంబంధించి పరిహారం కోసం ప్రయత్నించారు. కేంద్ర కరువు అధ్యయన బృందాలు రాష్ట్రంలో పర్యటించి నెలలు ముగుస్తున్నా పరిహారం రాకపోవడంతో ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టును ఆశ్రయించి సంగతి తెలిసిందే. కరువు పరిహారం ఇవ్వాలని కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఆ వెంటనే విడుదల చేశారు. ప్రస్తుతం ఇదే కోవలోనే భద్ర ఎగువ ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,300 కోట్ల సాధనకోసం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. గ్రాంట్ల మంజూరు విషయంలో కేంద్రప్రభుత్వం విధించిన షరతులలో ప్రధానంగా ప్రాజెక్టుకు సంబంధించి ఆర్థిక పరమైన అంచనాల సమాచారం సమర్పించాలని ఇప్పటి వరకు చేసిన ఖర్చు బకాయిలు, కేంద్రం మంజూరు చేసిన నిధుల వివరాలు ఇవ్వాలని, ప్రాజెక్టు భౌగోళిక విన్యాసం, ప్రాధాన్యత, ఆర్థిక లభ్యత గురించి సమగ్ర వివరాలు కోరింది. రాష్ట్ర ప్రభుత్వం తెలుపుతున్న మేరకు కేంద్రం అన్ని దశలలోనూ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిందని, బడ్జెట్‌లో గ్రాంట్లు ప్రకటించి తాజాగా షరతులు విధించడం సమాఖ్య వ్యవస్థలో సంప్రదాయాలకు విరుద్ధమని మంత్రులు అంటున్నారు. కేంద్రప్రభుత్వ గ్రాంటు వస్తుందని రాష్ట్రం ఇప్పటి వరకు రూ.9,713 కోట్లు ఖర్చు చేసింది. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కయ్యానికి కాలుదువ్వేందుకు సిద్ధమవుతోంది.

సీఎం కేసుపై సర్వత్రా ఉత్కంఠ..!

- నేడు కీలక నిర్ణయం వెలువడే అవకాశం
- అందరి చూపు హైకోర్టు వైపే



బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'ముడా' ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య భవితవ్యంపై గురువారం కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అందరూ ఎదురు చూస్తున్నారు. ముడా ఇంటి స్థలాల ఆరోపణలపై గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ సిద్దరామయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు నెల రోజులుగా సాగుతున్న ప్రక్రియ తుదిదశకు చేరే అవకాశం ఉంది. 12వ తేదీన కేసును ముగిస్తామని జస్టిస్ ఎం.నాగప్రసన్న ఈనెల ప్రారంభంలో ప్రకటించారు. కేసు ఈనెల 9న విచారణలు జరిగినా కాసేటికే గురువారానికి వాయిదా వేశారు. ఈ కేసులో సీఎం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తున్నారు. వాదనలు పూర్తయితే వెంటనే నిర్ణయాన్ని ప్రకటిస్తారా... లేదా తీర్పును పెండింగ్‌లో ఉంచుతారా..? అనేది ఉత్కంఠగా మారింది. ఒకవేళ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇస్తే రాజకీయంగా తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటాయి. లేదంటే సిద్దరామయ్య పదవికి ఢోకా ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముడా ఇంటి స్థలాల వివాదం అంత సులభంగా సమసిపోయే అవకాశం లేదు. ముడా మాజీ చైర్మన్‌పై సస్పెన్షన్ వేటు వేయడం, పలువురు అధికారులను బదిలీ చేయడం, ఒకేరోజున 350 మందికి ఇంటి స్థలాలు కేటాయించిన అంశంపై 18మంది అధికారులకు లోకాయుక్త నోటీసులు జారీ చేయడం వంటి అంశాలు కీలకమవుతున్నాయి. మరోవైపు ముడా కమిషనర్ అధికారిక నివాసంలో సీసీ కెమెరాలు కనిపించకపోవడం, వాటి డీవీఆర్‌లు గల్లంతు కావడం వంటి సాక్ష్యాలను నాశనం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటన్నింటినీ ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటే కేసు తీవ్రంగా మారే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

రంగంలోకి ఆర్‌ఎస్‌ఎస్

- బీజేపీ అసంతృప్త నేతలతో నేడు సమావేశం
- యత్నాళ్, అరవింద లింబావళి, రమేశ్ జార్కిహొళికి ఆహ్వానం

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో ఇటీవల కొంతకాలంగా అభిప్రాయభేదాలు తీవ్రమవుతున్న తరుణంలో ఆర్‌ఎస్‌ఎస్ రంగంలోకి దిగింది. గురువారం బీజేపీ సీనియర్ నేతలతో కీలక సమావేశం నిర్వహిస్తోంది. మాగడి రోడ్డులోని చెన్నేనహళ్లి సంఘ్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నారు. బీజేపీ కోర్ కమిటీ సభ్యులతోపాటు అసంతృప్తులను సభకు ఆహ్వానించినట్టు తెలుస్తోంది. సుమారు 40 మంది సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ డాక్టర్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రతోపాటు అసంతృప్తితో ఉన్న బసనగౌడ పాటిల్ యత్నాళ్, అరవింద లింబావళి, రమేశ్ జార్కిహొళిని ఆహ్వానించినట్టు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల తర్వాత ఇటువంటి సభ జరగడం ఇదే తొలిసారి. ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం దాకా కొనసాగే అవకాశం ఉంది. సీనియర్ నాయకులతో సమగ్రంగా చర్చించి భిన్నాభిప్రాయాలను కొలిక్కి తెచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధమైంది.



పరీక్షల కోసం.. నిరీక్షణ!

- కేపీఎస్సీలో గందరగోళం
- ఆందోళనలో 2 లక్షల మంది అభ్యర్థులు
- సీఎం ఆదేశించినా నిర్లక్ష్యం
- మళ్లీ నిర్వహణపై స్పష్టత కరువు

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేపీఎస్సీ) 384 గెజిటెడ్ ప్రొబేషనరీ ఆఫీసర్స్ పోస్టుల భర్తీ కోసం మళ్లీ నిర్వహించాల్సిన పరీక్షలపై స్పష్టత లేకపోవడంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. సుమారు రెండు లక్షల మంది అభ్యర్థులు తమ భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు. ఆగస్టు 27న రాష్ట్రవ్యాప్తంగా గెజిటెడ్ ప్రొబేషనరీ ఆఫీసర్స్ పోస్టుల కోసం పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నపత్రంలో పలు తప్పులు ఉండడంతో రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు ఆందోళన చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. రానున్న రెండునెలల వ్యవధిలో పరీక్షల ప్రక్రియ పూర్తి చేయాలని కేపీఎస్సీకి ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశించారు. ప్రశ్నపత్రంలో గందరగోళం కారణంగా అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందనే నిరసనల నేపథ్యంలో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియ వెనువెంటనే జరిగినా మళ్లీ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తామనే విషయంలో స్పష్టత లేకుండాపోయింది. కనీస సమాచారం కూడా కేపీఎస్సీ ఇంకా ప్రకటించకపోవడంతో ఇతర పరీక్షల్లో పాల్గొనేందుకు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. కేపీఎస్సీ ద్వారా కేఏఎస్ అధికారి కావాలని భావిస్తున్నవారికి ఆశనిపాతంగా మారింది. పరీక్షలపై స్పష్టత లేకపోవడంతో ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారు, నిరుద్యోగులు తమ భవిష్యత్తు కార్యాచరణపై డోలాయమానంలో పడ్డారు. ఆగస్టు 27న జరిగిన పరీక్షలకు సంబంధించిన గందరగోళంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించలేదు. ముఖ్యమంత్రి వద్దకు వెళ్లిన కమిషన్ పదాధికారులు పరిస్థితిని వివరించారు. దీంతో సీఎం ఆగ్రహం వ్యక్తం చేసి భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా చూడాలని మందలించారు. అంతలోనే సోషల్ మీడియా ద్వారా మళ్లీ పరీక్షలు జరుపుతామని సీఎం ప్రకటించారు. సాధారణంగా పరీక్షల్లో తప్పులు జరిగితే వెంటనే కమిషన్ సెక్రటరీ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. సుమారు 58 ప్రశ్నలకు ఇంగ్లీష్ నుంచి కన్నడ అనువాదంలో వ్యత్యాసం రావడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. కేపీఎస్సీ తప్పును అంగీకరించడం లేదు. 22 ప్రశ్నలు మాత్రమే తప్పులు ఉన్నాయని ప్రకటించుకుంది. సాధారణంగా ప్రతి మంగళవారం కేపీఎస్సీ పాలకమండలి సమావేశం జరుగుతుంది. ఈ వివాదం నెలకొని రెండు వారాలు ముగిసినా సమావేశంలో తీర్మానాలు బహిరంగపరచకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కేపీఎస్సీ పరీక్షల ద్వారా 384 గెజిటెడ్ ప్రొబేషనరీ అధికారుల పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందుకోసం 2,10,916 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 1,31,885 మంది పరీక్షల్లో పాల్గొన్నారు. పరీక్షలు రద్దు కావడం, మళ్లీ నిర్వహించాలనే తీర్మానం సులభతరమైనా ఆగస్టు 27న జరిగిన పరీక్షల్లో పాల్గొన్నవారికి మాత్రమే అర్హత ఉంటుందా, లేదా అందరూ పాల్గొనవచ్చా అనేది స్పష్టత లేదు. అభ్యర్థులు సొంత జిల్లాల్లో కాకుండా వారికి అనుకూలంగా ఉన్న ఇతర ప్రాంతాల్లో పరీక్షలు రాశారు. మళ్లీ పరీక్షల్లో పాల్గొనాలంటే వసతి, రవాణా తదితర ఖర్చులు భారం కానున్నాయి. దీంతో జిల్లా పరిధిలోనే అవకాశం ఇవ్వాలనే డిమాండ్ సాగుతోంది. ప్రశ్నపత్రంలో మార్కుల విభజనకు సరైన పద్ధతి పాటించలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రశ్నపత్రం రూపకల్పనలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందనే డిమాండ్ వినిపిస్తోంది.

తదుపరి ఎప్పుడో..?

మళ్లీ పరీక్షలు నిర్వహించేందుకు కమిషన్ తేదీ ప్రకటించాల్సి ఉంది. అంతకంటే ముందుగా పరీక్షలు జరిగే కేంద్రాల్లో ఇతర పరీక్షలు ఉన్నాయో లేదో గమనించాల్సి ఉంటుంది. కర్ణాటక పరీక్షా ప్రాధికార నుంచి నియామకాలకు సంబంధించి పరీక్షలకు ముందుగా ప్రకటించిన తేదీలను మార్పు చేయాల్సి ఉంటుంది. యూపీఎస్సీ పరీక్షలు కూడా ఆ తేదీలలో ఉండకూడదు. ఇలా పోటీ పరీక్షలతోపాటు ఉద్యోగాలకు సంబంధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎటువంటి పరీక్షలు లేని రోజులను మాత్రమే ఖరారు చేయడం అంత సులువుకాదు. పరీక్షల కోసం విద్యాశాఖతోపాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు గత ప్రశ్నాపత్రంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా ప్రశ్నపత్రాన్ని క్షుణ్ణంగా సిద్ధం చేయాల్సి ఉంటుంది. అక్టోబరు, నవంబరు నెలల్లో వివిధ పరీక్షలు ఉండడంతో డిసెంబరు వరకు తేదీ నిర్ణయించడం అంత సులువు కాదనిపిస్తోంది. ముఖ్యమంత్రి మాత్రం రెండు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

కమిషన్ సభ్యుడిపై విమర్శలు

కాంగ్రెస్ పార్టీతోపాటు ప్రభుత్వ స్థాయిలో తీవ్ర వ్యతిరేకత ఉన్నా పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా కువెంపు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ భోజ్యానాయక్‌ను నియమించారు. ఆయన ఇండస్ట్రియల్ కెమికల్ విభాగం అధ్యాపకుడిగాను, పరీక్షల విభాగం రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు. ఆయనపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పుడే ఆయనను కేపీఎస్సీ సభ్యుడిగా నియమించడంపట్ల సొంత పార్టీలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రార్‌గా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలపై లోకాయుక్తలో ఫిర్యాదు ఉంది. అటవీశాఖకు సంబంధించి కూడా ఇతడిపై ఓ కేసు ఉంది. 2023 ఆగస్టులో సీఎం సిద్దరామయ్య ఇతడి పేరును సిఫారసు చేసినా అవినీతి అంశం బహిరంగం కావడంతో వదిలేశారు. కానీ 2024 జూన్ 19న మళ్లీ అతడి పేరును సిఫారసు చేశారు.

శ్రీవారి సేవలో గవర్నర్

తిరుమల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలేశుడిని బుధవారం ముగ్గురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా మూలమూర్తిని దర్శించుకున్నారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువులు, టూరిజం సహాయమంత్రి సురేష్‌గోపి వేకువజామున తోమాల, అర్చనసేవలో పాల్గొని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. 12 ఏళ్ల తర్వాత కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నానని, స్వామి దర్శనంతో జీవితకాలానికి సరిపడా తృప్తి కలిగిందన్నారు. కేరళ రాష్ట్రంలోని వయనాడ్ కోలుకుంటోందన్నారు. ఏపీలోనూ వరద బాధితుల క్షేమం కోసం శ్రీవారిని ప్రార్థించినట్టు తెలిపారు. బ్రిటీష్ హైకమిషన్ డిప్యూటీ హెడ్ వరుణ్ సంజయ్ మాలి వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.



తిరుమల ఆలయం ముందు థావర్‌చంద్ గెహ్లోట్

మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యం

- మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యత ఉంటోందని మైనారిటీ సంక్షేమ, వక్ఫ్ బోర్డు శాఖల మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం మైనార్టీల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం నగరంలోని హజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ 579మందికి రూ.7.86 కోట్ల విలువైన సౌలభ్యాలు అందచేసినట్టు తెలిపారు. సారథి పథకం కింద వాహనాల పంపిణీ, వివిధ పథకాల కింద సహాయ ధనం అందచేసినట్టు పేర్కొన్నారు. 2013 నుంచి 2018 వరకు మైనార్టీలకు పలు కార్యక్రమాలు అమలు చేశారన్నారు. అంతకుముందు బడ్జెట్‌లో రూ.400 కోట్లు ఉండగా సిద్దరామయ్య ఆ మొత్తాన్ని రూ.3,150 కోట్లకు పెంచారని తెలిపారు. అనంతరం జేడీఎస్-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం దీన్ని తగ్గించిందన్నారు. బీజేపీ పాలనలో మైనార్టీలకు పలు పథకాలు కోత విధించారన్నారు. ప్రస్తుతం సిద్దరామయ్య ప్రభుత్వం గ్యారెంటీ పథకాల నడుమ కూడా మైనార్టీల కోసం రూ.3,200 కోట్లు కేటాయించిందన్నారు. వచ్చే ఏడాది రూ.5వేల కోట్లు కేటాయించే భరోసా ఉందన్నారు. ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ నసీర్ అహ్మద్, మాజీ మంత్రి హిండసగేరి, ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్, అబ్దుల్ జబ్బార్, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు అన్వర్ బాషా, కేఎండీసీ అధ్యక్షుడు బీకే అల్తాఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సారథి లబ్ధిదారులకు తాళాలు అందచేస్తున్న మంత్రి జమీర్




గౌరవ ఫెలోషిప్ పురస్కారాల ప్రదానంలో ప్రముఖులు

సర్కారుబడుల్లో సౌలభ్యాలు పెరగాలి

- పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎంఆర్ దొరస్వామి

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సర్కారుబడుల్లో సౌలభ్యాలు పెరగాలని, అప్పుడే పటిష్ఠమైన విద్యకు పునాది సాధ్యమవుతుందని పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి పేర్కొన్నారు. నగరంలో కర్ణాటక అసోసియేషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు యూనివర్సిటీ సంయుక్తంగా బుధవారం ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామికి గౌరవ ఫెలోషిప్‌ను ప్రదానం చేశాయి. ఇదే సందర్భంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో పద్మ విభూషణ్ గ్రహీత డాక్టర్ వీకే ఆత్రెకు, పారిశ్రామిక రంగంలో ఎస్.రుద్రగౌడకు ఫెలోషిప్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్ దొరస్వామి మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వ సలహాదారుడిగా వ్యవహరించినప్పుడు పాఠశాలల దత్తతకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ విధానం భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షించారు. మెంటార్ విధానంతో విద్యార్థుల్లో కొత్త శక్తిని నింపడం సాధ్యమవుతుందన్నారు. యూనివర్సిటీలకు వీసీల నియామకంలో అవినీతికి తావు లేకుంటే ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. ఇదే సందర్భంగా వీకె ఆత్రె మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అడుగులు వేస్తోందన్నారు. నాలెడ్జ్‌లో విశ్వగురు కానుందని, ఐటీబీటీ రంగాలలోనే కాకుండా సూపర్‌పవర్ దేశంగా మారుతుందనడంలో సంశయం లేదని తెలిపారు. సాధారణ వ్యక్తులు మేధావులుగా మారవచ్చు అనేందుకు సర్ ఎం. విశ్వేశ్వరయ్య, ఐన్‌స్టీన్, సీవీ రామన్ వంటి వారే నిదర్శనమని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కులపతి జైకర్ మాట్లాడుతూ త్రిరత్నాలకు గౌరవ ఫెలోషిప్ అందించడం గర్వకారణంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తిని ఇచ్చినట్టు అవుతుందని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేఏఎస్ అధ్యక్షుడు డాక్టర్ కె.సిద్దప్ప, డాక్టర్ అశోక్ డి. హంజగి, ప్రొఫెసర్ టీసీ ప్రభాకర్, ప్రొఫెసర్ ఎన్ నాగయ్య పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.88	1,622.68
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	27,861	2959
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	26,478	10,001
సామర్థ్యం (టీఎంసీలు)	101.30	69.17

కొత్త టెక్నాలజీతో బిల్డింగ్ నిర్మాణం

13నుంచి కమ్మభవన్‌లో ఎగ్జిబిషన్



మాట్లాడుతున్న ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌గౌడ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 11: కొత్తరకాల మెటీరియల్స్ టెక్నాలజీతో బిల్డింగ్ నిర్మాణం చేసుకోవచ్చని ఇంజినీర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్‌సంఘం అధ్యక్షుడు హొసూరు ఈశ్వర్‌గౌడ్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. సర్. ఎం.విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా బళ్లారి అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ ఇంజినీర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ ఆధ్వర్యంలో 13నుంచి కమ్మభవన్‌లో ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. ఇందులో ప్రజలు కొత్త రకాల నిర్మాణ వస్తువులు, సాంకేతికత గురించి తెలుసుకోవచ్చునన్నారు. ఎగ్జిబిషన్‌లో 55 స్టాల్స్‌లో వినూత్న రకాల బిల్డింగ్ మెటీరియల్స్ ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయన్నారు. నగరంలో ఇల్లు కట్టుకునే వారికి ఇది సౌకర్యంగా ఉంటుందని, వినియోగదారులు, కంపెనీలు, విక్రేతల మధ్య లింక్‌గా పనిచేస్తుందన్నారు. ఇందులో వివిధ నిర్మాణ సామాగ్రి కంపెనీల, జాతీయ, అంతర్జాతీయ స్థాయి విక్రయదారులు పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ ఇంజినీర్లు, సాంకేతిక కళాశాలల అధిపతులను సన్మానించారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి పి.ప్రకాశ్, సంయుక్త కార్యదర్శి రాజీవ్, టీఆర్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ హనుమంతప్ప

బళ్లారి సిటీ, సెప్టెంబరు 11: ప్రసవం తర్వాత పుట్టిన బిడ్డకు 12 ప్రాణాంతక వ్యాధులకు వయస్సుకు తగిన టీకాలు వేయించేలా తల్లిదండ్రులను ఒప్పించాలని జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప వైద్య సిబ్బందికి సూచించారు. నగరంలోని అల్లం గోకులం భవన్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహకారంతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్ననాటి ప్రాణాంతక వ్యాధులను నివారించడానికి, పిల్లలకు ఏడాదిలోపు తప్పకుండా టీకాలు ఇచ్చేలా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. 16నుంచి 23 నెలల్లో బూస్టర్ డోస్ అదనంగా ఇవ్వనున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేధికారి శ్రీధర్ తెలిపారు. ఈసందర్భంగా జిల్లా క్షయవ్యాధి నిర్మూలన అధికారిణి డాక్టర్ ఇంద్రాణి, జిల్లా సర్వే అధికారిణి డా.మరియంబి, జిల్లా కుటుంబ సంక్షేమ కార్యక్రమ అధికారిణి డాక్టర్ పూర్ణిమ కట్టిమణి, కుష్ఠువ్యాధి నిర్మూలనాధికారి వీరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న లోకాయుక్త అధికారులు

సిరుగుప్ప, సెప్టెంబరు 11 : తాలుకాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎదురయ్యే సమస్యల గురించి లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేస్తే సమస్యలు తక్షణం పరిష్కరిస్తామని లోకాయుక్త సీఐ సంగమేష్ తెలిపారు. సిరుగుప్ప పట్టణం సీడీపీవో భవనంలో బుధవారం లోకాయుక్త అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. నగరసభ పరిధిలో అక్రమ కట్టడాలను తొలగించాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఫారమ్ నెంబర్ 3ను ప్రజలకు ఇవ్వడంలేదని అధికారులకు ప్రజలు విన్నవించారు. పౌరసరఫరాలకు సంబంధించి అధికారులు రేషన్ డీలర్లతో కుమ్మక్కై సబ్సిడీ బియ్యాన్ని అందజేయడంలేదని ప్రజలు అధికారులకు తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విశ్వనాథ్, నగరసభ కమీషనర్ గురుప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

అలరిస్తున్న గణేశ్ ఉత్సవాలు



వినాయక చవితి సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయ విగ్రహాల వద్ద పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గడచిన నాలుగు రోజులుగా నిత్య పూజలు నిర్వహించిన నిర్వాహకులు ఐదవ రోజు బుధవారం పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సిరుగుప్ప నేతాజీ వ్యాయామశాలలో, రాయచూరు నగరంలోని మక్తల్‌పేటలో మున్నూరుకాపు సమాజం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కంప్లి పట్టణంలో సరత్ సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సిరుగుప్పలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో 11వ రోజున గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కుడితిని పంచాయతీ అధ్యక్షురాలు బసమ్మ, చంద్రప్ప మాట్లాడుతూ వినాయక చవితి వేడుక అందరిలో ఉత్సాహం నింపుతోందన్నారు. ఎమ్మెల్యే జేఎన్ గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిమజ్జనం శాంతియుతంగా చేపట్టాలన్నారు. -కంప్లి / సిరుగుప్ప/ రాయచూరు

అటకెక్కిన హెచ్చెల్సీ ఆధునికీకరణ

- నీటి వనరులు నిర్వీర్యం
- పీఏబీఆర్ సామర్థ్యం పెంపు అంతేనా?
- నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్/రాయదుర్గం, సెప్టెంబరు 11: వైసీపీ హయాంలో జలవనరులశాఖను నిర్వీర్యం చేశారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టులను గాలికి వదిలేశారు. ఈ రెండింటి నిర్వహణకు గడిచిన ఐదేళ్లలో పైసా ఇవ్వలేదు. టీడీపీ హయాంలో మంజూరైన పనులను నిలిపివేశారు. జీడిపల్లి నుంచి పేరూరు డ్యాం, బీటీ ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు చేపట్టిన ప్రాజెక్టులను అర్ధంతరంగా ఆపేశారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ, పీఏబీఆర్ సామర్థ్యం పెంపు గురించి పట్టించుకోలేదు. ఇది చాలదన్నట్టు వైసీపీ జిల్లా కార్యాలయ భవనానికి రెండు ఎకరాల హెచ్చెల్సీ స్థలాన్ని కేటాయించారు. తెలుగుతల్లి కూడలిలో ఉన్న హెచ్చెల్సీ ఎస్‌ఈ కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. రెండేళ్లుగా మూడు గదుల్లో కార్యాలయం కొనసాగుతోంది. ఇన్ని సమస్యల నడుమ సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం గురువారం జరగనుంది. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ఐఏబీ సమావేశానికి చైర్మన్ హోదాలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షత వహిస్తారు. జలవనరుల శాఖ ప్రధాన సమస్యలపై చర్చించి, పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉంది.

ఆగిన ఆధునికీకరణ

హెచ్చెల్సీ ఆధునికీకరణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. 2008-09లో రూ.458 కోట్లతో హెచ్‌ఎల్‌ఎంసీ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. 2018 వరకు రూ.310 కోట్ల పనులు జరిగాయి. మిగిలిన రూ.148 కోట్ల పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వాటిని పూర్తి చేయాలంటే ప్రస్తుతం రూ.500 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని హెచ్చెల్సీ అధికారులు, ఇంజనీర్లు చెబుతున్నారు. ఆధునికీకరణ పనులను పూర్తి చేస్తే 2600 క్యూసెక్కులు ఉన్న కాలువ సామర్థ్యాన్ని 4200 క్యూసెక్కులకు పెంచుకోవచ్చు. టీబీ డ్యాం నుంచి అదనంగా వరద నీటిని జిల్లాకు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.



హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న నీరు

పీఏబీఆర్ నిండేది ఎన్నడు..?

జిల్లాలో అతిపెద్ద జలవనరు.. పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్). దీని పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు. కానీ ఎప్పుడూ ఇంత నీటిని నిల్వ చేసింది లేదు. భూసేకరణ చేపట్టకపోవడం, నిల్వ సామర్థ్యాన్ని పెంచకపోవడం దీనికి కారణం. పీఏబీఆర్ సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు రూ.5 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ ఏర్పాటు చేసిన పుణెకు చెందిన కంపెనీ పేర్కొంది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. 11 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి రూ.450 కోట్లు అవసరం. వరద నీటిని నిల్వ ఉంచేందుకు నిర్మించ తలపెట్టిన ఉంతకల్లు రిజర్వాయర్ డీపీఆర్ తయారీకి రూ.4.8 కోట్లు అవసరం. వైసీపీ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. హంద్రీనీవా కాలవ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం డ్యాం నుంచి 3850 క్యూసెక్కులు నీటిని తరలించేందుకు వీలుగా కాలువ ఉంది. ఎక్కువ నీటిని తక్కువ సమయంలో తరలించాలంటే కాలువ వెడల్పు పెంచాలి. లైనింగ్ వేయాలి. కాలువ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచాలని టీడీపీ హయాంలో ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రకృతి పరిరక్షణే.. ప్రథమ కర్తవ్యం

- అటవీ అమరవీరులకు నివాళులర్పించిన న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 11: ప్రకృతి బాగుంటేనే మంచి వర్షాలు కురిసి పంటలు పండుతాయని ప్రకృతి పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని జిల్లా స్పెషన్స్ న్యాయాధికారి శాంతి అన్నారు. బళ్లారి డివిజన్ అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కార్యాలయంలో జరిగిన జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలువేసి అనంతరం మాట్లాడారు. ఎందరో మహానుభావులు అటవీ సంరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించి ప్రకృతి మనుగడకు కృషిచేస్తున్నారన్నారు. సమాజానికి, అడవికి మధ్య జరిగే సంఘర్షణలో మనిషి అటవీ ప్రాంతాలను ఆక్రమించి వన్యప్రాణులను నాశనం చేయడం దురదృష్టకరమన్నారు. అటవీ శాఖ సహకారంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఏక్ మా ఏక్ పేడ్ (తల్లి పేరుతో ఒక మొక్క) కార్యక్రమం మంచి ఉద్దేశ్యంతో, పర్యావరణ బాధ్యతను ప్రజలకు గుర్తు చేసేందుకు ఉపయోగపడుతుందని ఆమె ప్రశంసించారు. ప్రకృతి ఒడిలో ఔషధ మొక్కలతో సహా వివిధ సహజ వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రకృతిని తరువాత తరానికి బహుమతిగా ఇవ్వాలని, ప్రకృతి విధ్వంసం మానవాళిని నాశనం చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ అడవి మనుగడ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కృషిని స్మరించుకోవాలని, అడవిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలన్నారు. మనదేశం, రాష్ట్రంలోని అడవుల మనుగడకు అటవీశాఖ అధికారులు విశేష కృషి చేస్తున్నారని, చుట్టూ ఉన్న దట్టమైన అటవీ ప్రాంతాన్ని పరిరక్షించడంలో వారి పాత్ర ఎంతో కీలకమన్నారు. అటవీ శాఖ బళ్లారి డివిజన్ డిప్యూటీ కన్జర్వేటర్ సందీప్ సూర్యవంశీ మాట్లాడుతూ సెప్టెంబర్ 11న రాష్ట్రీయ అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వ అటవీ, వాతావరణ శాఖ ప్రకటించిందని వివరించారు. అమరవీరుల స్మారక స్థూపం వద్ద అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అరసికెరెలో ఎలుగుబంటి



బళ్లారి సిటీ, సెప్టెంబరు 11: విజయనగరం హర్పనహళ్ళి తాలూకా జగలూరు సరిహద్దులోని బసవన్‌కోట్ పరిసర ప్రాంతాల్లో వారం రోజులుగా ఎలుగుబంటి ప్రత్యక్షమై ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. అరసీకెర, బసవన్‌కోట్, మాదిరిహళ్లి గ్రామ రహదారులపై తరచూ ఆ ఎలుగుబంటి కనిపిస్తుండగా వాహనదారులు దాన్ని మొబైల్‌ఫోన్లలో బంధించారు. దీంతో రైతులు, కూలీలు పొలాలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ధార్మిక ప్రఖ్యాతి గాంచిన మద్రాల్లి చౌడమ్మ ఆలయానికి అరసీకెరె మీదుగా వెళ్లాలంటే భక్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు సందర్శించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేడుకగా గౌరసముద్రం మారెమ్మ పండుగ



మారెమ్మకు దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు

కంప్లి, సెప్టెంబరు 11: మెట్రి, దేవలాపురం గ్రామంలో గౌరసముద్రం మారెమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. దేవలాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనను స్థానికులు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి యేటా ఈ పండుగను దేవలాపురం, మెట్రి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని తెలిపారు. ఇలాంటి పండుగల వల్ల గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



బహుమతులు అందిస్తున్న మౌనేష్, రవి

కంప్లి, సెప్టెంబరు 11: విద్యార్థినులు క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సమాజ సేవకుడు మౌనేష్ తెలిపారు. గత రెండు రోజులుగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు జరిగిన క్రీడల్లో బుధవారం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మౌనేష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే మరింత గుర్తింపు వుంటుందని తెలిపారు. క్రీడల వల్ల స్నేహానుబంధాలు, ఆరోగ్యం పెంపు జరుగుతాయన్నారు. క్రీడల్లో గెలిచినా, ఓడినా సమానంగా తీసుకున్నప్పుడే జీవితంలో ముందడుగు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రవి, ప్రిన్సిపాల్ షఫీ, వివిధ కళాశాలల ఉపన్యాసకులు కళాశాల దాతలు పాల్గొన్నారు.

కబరస్థాన్ అభివృద్ధి పదాధికారుల నియామకం

కంప్లి: పట్టణంలోని హొస్పేట బైపాస్ కబరస్తాన్ అభివృద్ధి (సున్నీ) సంఘం పదాధికారుల నియామకం జరిగింది. అధ్యక్షులుగా అబ్దుల్ ఫరూక్, ఉపాధ్యక్షులుగా నజీర్ అహ్మద్, కార్యదర్శి మౌలా హుస్సేన్, కోశాధికారిగా వన్నూరుబాషా, మస్తాన్, రియాజ్‌లు సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం అధ్యక్షులు అబ్దుల్ ఫరూక్ మాట్లాడుతూ త్వరలో కబరస్తాన్ నిర్మాణానికి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేపడతామని తెలిపారు. ప్రతిఒక్కరు తమకు సహకరించాలని, అందరూ మనస్పర్థలు వదిలి అభివృద్ధికి ముందుకు రావాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్టు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 11: తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోగల కారేకల్లు సమీపంలో ఓ గుట్ట వద్ద ఐదుగురు వ్యక్తులు జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ నాగభూషణం ఆధ్వర్యంలో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లను, రూ.23 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పీడీ హళ్లి పోలీసులు తెలిపారు.

హోసూరు జోన్

కొత్త బస్‌స్టేషన్ మంజూరు.. సీఎంకు ధన్యవాదాలు

డీఎంకే జిల్లా సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించిన సభ్యులు



డీఎంకే సమావేశంలో పాల్గొన్న సభ్యులు

హోసూరు సెప్టెంబరు 11 : హోసూరు కార్పొరేషన్ అభివృద్ధికి విమానాశ్రయం, కొత్త బస్‌స్టేషన్, భూగర్భ మురుగునీటి పారుదల ప్రాజెక్టు వంటి సంఓేమ పథకాలు అందించినందుకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ.. డీఎంకే పార్టీ జిల్లా శాఖ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. రాష్ట్ర కమిటీ సలహా మేరకు డీఎంకే ఆధ్వర్యంలో పశ్చిమ జిల్లా హోసూరు ప్రాంతం 41వ వార్డులో బుధవారం జనరల్ సభ్యుల సమావేశం జరిగింది, సభకు వీరేశం అధ్యక్షత వహించారు. మహేశ్‌బాబు స్వాగతోపన్యాసం చేసి తీర్మానాలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో కృష్ణగిరి పశ్చిమ జిల్లా సమితి చైర్మెన్ యువరాజ్, కోశాధికారి సుకుమారన్, సౌత్ రీజియన్ కార్యదర్శి తిమ్మరాజు పాల్గొన్నారు.

పన్ను చెల్లించకపోతే నీటి సరఫరా నిలిపివేత

హోసూరు(సిఫ్‌కాట్) సెప్టెంబరు 11: కార్పొరేషన్ పరిధిలో నిర్మించిన ఇళ్లు వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థలు కార్పొరేషన్‌కు ఆస్తిపన్ను చెల్లించాలని కమిషనర్ శ్రీకాంత్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. భవనాల యజమానులు 25వ తేదీ నాటికి హోసూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధిత పత్రాలతో పన్నుచెల్లించాలని అభ్యర్థించారు. విఫలమైతే కార్పొరేషన్ ద్వారా ఆస్తిపన్ను నిర్ణయించడంతో పాటు భవనాలకు తాళాలు వేసి సీల్ చేస్తామన్నారు. కుదరని పక్షంలో తాగునీటి సరఫరా కనెక్షన్ కట్ చేస్తామన్నారు.

టెంపో ఢీకొని చిన్నారి మృతి.. స్థానికుల ధర్నా

హోసూరు(క్రైం) సెప్టెంబరు 11: తళి సమీపంలోని వనమంగళం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న మూడేళ్ల చిన్నారి శశికళ బుధవారం రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో రెచ్చిపోయిన స్థానికులు ధర్నాకు దిగారు. చిన్నారి మూత్ర విసర్జన కోసం అంగన్‌వాడీ కేంద్రం నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న టెంపో వాహనం ఢీ కొనడంతో మృతి చెందింది. ఈ వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ మునికృష్ణన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే ఈ అంగన్‌వాడీ కేంద్రంలో సరైన మరుగుదొడ్లు లేకపోవడంతో చిన్నారి బయటకు వచ్చి ప్రమాదంలో మృతి చెందిందని, అంగన్‌వాడీ కేంద్రం సూపరింటెండెంట్ పరిమళం, వర్కర్ వరలక్ష్మిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ పరిస్థితిలో మృతురాలు శశికళ తల్లి తండ్రులు మధు, ఆశ వనమంగళం గ్రామానికి చెందిన 100 మందికి పైగా హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆకస్మికంగా ధర్నా నిర్వహించారు. చిన్నారి మృతికి కారకులైన ప్రభుత్వోద్యోగులను శాశ్వతంగా పనినుంచి తొలగించాలని, ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా తగిన మరుగుదొడ్లు ఏర్పాటుచేయని అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన చిన్నారి తల్లికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. రాత పూర్వకంగా రాసి ఇస్తేనే ధర్నాను విరమించుకుంటామని తెలిపారు. సబ్ కలెక్టర్ వినతిపత్రాన్ని అందుకుని చర్యలు తీసుకుంటామని తెలిపిన తర్వాతే ధర్నా విరమించుకున్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

15న రాయచూరులో 109కి.మీ. మానవహారం



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, ప్రజాసంఘాలు

రాయచూరు సెప్టెంబరు 11: అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15న రాష్ట్రస్థాయి మానవహారం ఏర్పాటు చేయనుందని జిల్లాధికారినితీశ్ తెలిపారు. ఇందుకు జిల్లాలో ప్రతి ఒక్కరు సహకరించి మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకు ఏర్పాటుకు సంబంధించి బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లాధికారి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో 109 కిమీ దూరం దేవదుర్గ తాలూకా నుంచి లింగసుగూరు తాలూకా వరకు మానవహారం ఏర్పాటు చేయనున్నామన్నారు. మానవహారం ఏర్పాటు చేసే అవకాశం ఉన్న గ్రామ పంచాయతీలు, తాలూకా పంచాయతీలు తమ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిశాఖలు ఈ విషయంలో సమన్వయంతో పని చేస్తూ తమ గ్రామ పంచాయతీ, తాలూకా పంచాయతీ పరిధిలో కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా చూడాలన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలందించాలి: ఎంపీ నాయక్

రాయచూరు సెప్టెంబర్ 11: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలందించాలని రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్ సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు జిల్లాలోని మాన్వి తాలూకా కపగల్ గ్రామం వద్ద జరిగిన భారీ రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థులను ఎంపీ కుమార్ నాయక్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడిన ఎంపీ, విద్యార్థులకు అందుతున్న వైద్యసేవలు, కోలుకుంటున్న పరిస్థితి తదితర వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన ఎంపీ, ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఎంపీ

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయిన్...

శివశంకర శాస్త్రి (జయంతి)



తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి 1892 సెప్టెంబరు 12న గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామంలో జన్మించారు. సాహితీవేత్త, నాటక రచయిత, నాటక ప్రయోక్త, దర్శకుడు. భావకవితా ఉద్యమ పోషకుడు. తెనాలిలోని శ్రీరామవిలాస సభ నాటక సంస్థలో దర్శకుడిగా పనిచేశారు. హిందీ, ఆంగ్ల, బెంగాలీ, సంస్కృతం, పాళీ భాషల్లో నిష్ణాతుడు. ఆయా భాషల నుంచి తెలుగులోకి అనేక గ్రంథాలను అనువదించారు. నవసాహిత్య పరిషత్తు, సాహితీసమితి వంటి సంస్థలను స్థాపించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో రెండుసార్లు కారాగార శిక్ష అనుభవించారు. 1972లో కన్నుమూశారు.

అయ్యప్ప పణిక్కర్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత అయ్యప్ప పణిక్కర్ 1930 సెప్టెంబరు 12న కేరళ రాష్ట్రం అలప్పుజా జిల్లా కావ లం గ్రామంలో జన్మించారు. మళయాళ కవి, సాహితీవేత్త. 25కు పైగా రచనలు ప్రచురితమయ్యాయి. 1960లో 'కురుక్షేత్రం' రచన ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. అనేక ప్రముఖ రచనలు మళయాళంలోకి అనువాదం చేశారు. 'సాహిత్య అకాడమీ'కి ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు. కేరళ సాహిత్య అకాడమీ, సరస్వతీ సమ్మాన్, కేంద్ర సాహిత్య అకాడమీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2006 ఆగస్టు 23న కన్నుమూశారు.

నార్మన్ బోర్లాగ్ (వర్ధంతి)



నార్మన్ ఎర్నెస్ట్ బోర్లాగ్ 1914 మార్చి 25న అమెరికా దేశం అయోవా ప్రాంతంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. మైక్రో బయా లజిస్ట్‌గా ఎన్నో పరిశోధనలు చేశారు. హరిత విప్లవ పితామహుడు. చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే పొట్టిరకం గోధుమ వంగడాలను ఆవిష్కరించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజలను ఆకలి బాధల నుంచి, పస్తుల నుంచి రక్షించినవారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత. 95 యేట 2009 సెప్టెంబరు 12న కన్నుమూశారు.

అమల అక్కినేని (పుట్టినరోజు)



ప్రముఖ నటి అమల 1967 సెప్టెంబరు 12న కోల్కత్తాలో జన్మించారు. భరతనాట్య కళాకారిణి, జంతు ప్రేమికురాలు. బ్లూ క్రాస్ సంస్థ సహ సంస్థాపకులు. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మళయాళం సినిమాలలో నటించి రెండు ఫిల్మ్ ఫేర్ అవార్డులు అందుకున్నారు. 1980వ దశకంలో హీరోయిన్‌గా రాణించారు. యువ సామ్రాట్ నటుడు నాగార్జున సతీమణి. జీవ దయా పురస్కార్, నారీశక్తి అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు.

విద్యార్థుల వ్యక్తిత్వ రూపకల్పనలో టీచర్లదే కీలక పాత్ర



ఉపాధ్యాయులకు సన్మానం

బంగారపేట, సెప్టెంబరు 11: విద్యార్థులలో ఆత్మవిశ్వాసంతోపాటు సామాజిక, నైతిక , మానవతా విలువలతో కూడిన సమగ్ర వ్యక్తిత్వంతో రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమని ఎమ్మెల్యే నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని ఎస్ ఎన్ రిసార్టులో జాతీయపండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆశయమైన గురు భవన నిర్మాణానికి 10 గుంటల స్థలాన్ని ఉద్దేశించినా ఉపాధ్యాయులో ఐక్యత కొరత, నిరాసక్తితో ఆ స్థలం అన్యాక్రాంతమైందన్నారు. త్వరలోనే తహసీల్దార్ నేతృత్వంలో ఆక్రమణలు తొలగించి శిక్షకర భవనకు కేటాయించనున్నట్టు తెలిపారు. నెలలోగా బీఈఓ కార్యాలయాన్ని మార్పు చేస్తామని, మూడు నెలల్లో నూతన బీఈఓ కార్యాలయానికి భూమి పూజ చేస్తామన్నారు. కాగా బీఈఓగా రెండేళ్లపాటు సుదీర్ఘంగా వ్యవహరించిన సుకన్యా బదిలీలో తన ప్రమేయం లేదన్నారు. పురసభ అధ్యక్షుడు గోవింద, తహసీల్దార్ వెంకటేశప్ప, ఈఓ రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి అంజలిదేవి తదితరులు పాల్గొన్నారు.

చిక్కబళ్లాపుర జిల్లాకు త్వరలో ప్రత్యేక పాల సమాఖ్య

శిడ్లఘట్ట, సెప్టెంబరు 11: చిక్కబళ్లాపుర జిల్లాకు త్వరలో ప్రత్యేక పాలసమాఖ్య రానుందని కేఎంఎఫ్ డైరెక్టర్ శ్రీనివాసరామయ్య వెల్లడించారు. తాలూకాలోని హిరేబల్ల పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం వార్షిక సామాన్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అవిభాజ్య కోలారు జిల్లానుంచి చట్టరీత్యా సమాఖ్య వేరు కానుందన్నారు. ఎంతో కాలంగా చిక్కబళ్లాపురకు ప్రత్యేక పాలసమాఖ్య డిమాండ్ ఉందని త్వరలోనే సాకారం కానుందన్నారు. హిరే బల్ల గ్రామంలో ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేం దుకు ప్రయత్నాలు చేశామని, పలు కారణాలతో జాప్యమైం దన్నారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పారదర్శక విధానాలు పాటిస్తున్నామన్నారు. ఇదే సంద ర్భంగా పాల దిగుబడిలో సాధించిన ముగ్గురిని సత్కరించారు. కార్య క్రమంలో కోచిముల్ మాజీ అధ్యక్షుడు గుడి యప్ప, శిబిరం కార్యా లయ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ రవికిరణ్, విస్తరణాధికారి జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కేఎంఎఫ్ డైరెక్టర్ శ్రీనివాసరామయ్య

సంతానలేమికి ఆధునిక వైద్యం



నమ్మ ఎలక్ట్రానికోసిటీ సెంటర్ ప్రారంభంలో వైద్య ప్రముఖులు

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంతానలేమికి ఆధునిక వైద్యం అందు బాటులోకి వచ్చిందని సద్వినియోగం చేసుకోవాలని ఆర్భిష్ ఫెర్టిలిటీ సైంటిఫిక్ డైరెక్టర్ రిషినా బన్సాల్ అభిప్రాయ పడ్డారు. ఎలక్ట్రానిక్ సిటీలో బుధ వారం కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఐవీఎఫ్ చెయిన్ లింక్ ఆర్భిష్ ఫెర్టిలిటీ అండ్ ఐవీఎఫ్ బెంగళూరు నియో హెల్త్ క్లినిక్‌ల సహకారంతో నమ్మ ఎలక్ట్రానికోసిటీ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. జీవన శైలిలో మార్పులు, స్థూలకాయం, ధూమ పానం, జంక్‌ఫుడ్ తోపాటు పలు కారణాలతో సంతానలేమి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఆర్భిష్ ఫెర్టిలిటీ పలువురు దం పతులకు సంతానం కలిగించిందన్నారు. సరికొత్తగా ఆండ్రాలజీ వింగ్, ఆండ్రో 360 ద్వారా పురుషులలో సమస్యలకు చికిత్సలు అందిస్తున్నామన్నారు. పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఐవీఎఫ్ విధానంలో సంతానలేమి సమస్యను పూర్తిగా అధిగమించవచ్చు అన్నారు. ఆర్భిష్ నగరంలో ఐదు కేంద్రాలు కలిగి ఉందని వివరించారు. అంతర్జాతీయ అనుభవం ఆర్భిష్‌కు ఉందన్నారు. కార్య క్రమంలో ఆర్భిష్ ఫెర్టిలిటీ కన్సల్టెంట్ ఇంపాశ్రీ, నియో క్లినిక్స్‌కు చెందిన డాక్టర్ పునీత్, హార్దిక్ ఠక్కర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జన ఉత్సవం

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 11: వినాయకచవితి పురస్కరించుకుని హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్, అగర ప్రాంతాలలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఐదురోజులు కావడంతో బుధవారం నిమజ్జనం నిర్వహించారు. స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతిరోజూ విశేష పూజా కార్యక్రమాలు సాగాయి. మధ్యాహ్నం విశేష అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పురవీధులలో ఊరేగించి అగర చెరువులో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో భారీ బందోబస్తు కేటాయించారు. ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చేళూరు: చేళూరు తాలూకా కేంద్రంలో వినాయక నిమజ్జన కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా సాగింది. స్థానిక వాసవిస్త్రంలో కొలువుదీర్చిన వినాయకుడిని సంప్రదాయంగా ఊరేగించారు. స్థానిక ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందినవారు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి ఉత్సవంలో పాల్గొన్నారు. మేళతాళాల నడుమ ఊరేగింపు సాగింది. పట్టణ శివారులోని చెరువులో గణనాథుడిని నిమజ్జనం చేశారు.



అగరలో కాంగ్రెస్ నాయకుడు తదితరులు



చేళూరులో ఊరేగింపు

ఫ్లై ఓవర్ నుంచి రాడ్ పడి ఏఎస్ఐకి తీవ్ర గాయాలు

▸▸ నిర్మాణ కంపెనీ ఎండీపై ఎఫ్ఐఆర్



ఏఎస్ఐ నాభిరాజ్ దయణ్ణ

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళి నగరంలో ఫ్లై ఓవర్ నుంచి రాడ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై పడంతో ఆయన పరిస్థితి విషమంగా మారింది. ఈమేరకు నిర్మాణ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తోపాటు 16మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హుబ్బళ్ళి అర్బన్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై నాభిరాజ్ దయణ్ణ (59) గాయపడినవారు. అతడిని హుబ్బళ్ళి కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. హుబ్బళ్ళి కోర్టు సర్కిల్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇదే సమయంలో ఏఎస్సై నాగరాజ్ విధులలో భాగంగా మంగళవారం స్టేషన్‌వైపు వెళ్తుండగా అతడి తలపై ఐరన్‌రాడ్ పడింది. తీవ్రంగా గాయపడంతో స్థానికులు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పగటివేళ కొనసాగిస్తున్నారని కనీసం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లై ఓవర్ ని ర్మాణం చేపట్టిన జుండు కన్‌స్ట్రక్షన్స్ ఎండీతోపాటు 16మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు

నాణ్యమైన విత్తనాలతో ఉత్తమ దిగుబడి



రైతులతోపాటు సంస్థ అధికారులు తదితరులు

బాగేపల్లి, సెప్టెంబరు 11: పంట ఏదైనా ఉత్తమ దిగుబడి సాధించాలంటే నాణ్యమైన విత్తనాలు వాడాలని అశోక కంపెనీ అధికారి శ్రీధర్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ఆచేపల్లి గ్రామంలో ఆదర్శ రైతు ఈశ్వరరెడ్డి పొలంలో బెంగళూరుకు చెందిన అశోక కంపెనీ విత్తనాల గురించి సంస్థ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ రైతులు తమ రెమో బ్రాండ్ బీట్‌రూట్ విత్తనాలు వాడడం ద్వారా ఉత్తమ దిగుబడి సాధించారన్నారు. 20ఏళ్లుగా తమ సంస్థ నాణ్యమైన విత్తనాలు అందిస్తోందని బీట్‌రూట్, కొత్తిమీర, బీన్స్ సహా వివిధ రకాల పంటలకు సంబంధించిన వంగడాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. చిక్కబళ్ళాపుర జిల్లాలోని గుడిబండ, బాగేపల్లి, తాలూకా, చేళూరు తదితర తాలూకాల రైతులు అశోక కంపెనీ విత్తనాలు వాడి ప్రయోజనం పొందారని, ప్రత్యక్షంగా వచ్చిన దిగుబడిని చూపారు. రైతు ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ రెండు ఎకరాలలో బీట్‌రూట్ విత్తనాలు వేసి సొంత ట్రాక్టర్‌తో సాగు చేశానని రూ.80వేల ఖర్చు వచ్చిందన్నారు. ప్రస్తుతం కిలో రూ.50గా ఉందని, 10 టన్నుల బీట్‌రూట్ దిగుబడి సాధ్యమని మార్కెట్‌లో ఇదే ధర కొనసాగితే లక్ష రూపాయలకుపైగా లాభం సాధ్యమన్నారు. ఈ సందర్భంగా సంస్థ దుస్తులు, బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. చుట్టుపక్కల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వరద బాధితులకు సత్యసాయి ట్రస్టు సేవలు

విజయవాడలో నిత్యావసర కిట్ల పంపిణీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 11: వరదలకు తీవ్రంగా నష్టపోయి, నిరాశ్రయులైన విజయవాడ వాసులకు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు సాయం అందించింది. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని శివనాథ్ బుధవారం వరద బాధితులకు సరుకుల పంపిణీని ప్రారంభించారు. వరదప్రభావిత ప్రాంతాలైన న్యూరాజీవ్ కాలనీ, పాతరాజీవ్ కాలనీ, కొత్తరాజరాజేశ్వరి పేట, శాంతినగర్‌లోని 7 వేల కుటుంబాలకు అమృత కలశం (నిత్యావసర సరుకుల) కిట్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కోటేశ్వరరావు, సత్యసాయి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ సభ్యుడు చలం, సాయిప్రసాద్, 600 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



వరద బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఆర్జే రత్నాకర్

నేటి నుంచి రెండు ఆటలు

- దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు
- రెండు మ్యాచ్‌లు... నాలుగు జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11: దులీప్‌ట్రోఫీలో భాగంగా బుధవారం నుంచి సెకండ్ రౌండ్ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ వేదికగా 12 నుంచి 15వతేదీ వరకు మ్యాచ్‌ల నిర్వహణకు బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇండియా ఏ, బీ, సీ, డీ జట్ల ప్లేయర్లు బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. గురువారం ఏసీజీ ఏ, ఏసీజీ బీ స్టేడియాల్లో రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఏ గ్రౌండ్‌లో ఇండియా-ఏ, ఇండియా డీ జట్ల మధ్య, బీ గ్రౌండ్‌లో ఇండియా-బీ, ఇండియా-సీ జట్ల మధ్య సెకండ్ రౌండ్‌లో పోటీలు జరగనున్నాయి. పోటీలకు సంబంధించి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, బీసీసీఐ మేనేజర్ అమిత్ సిద్దేశ్వర్‌లు ఏసీజీ ఏ, ఏసీజీ బీ మైదానాలను పరిశీలించారు. క్రీడాకారుల పెవిలియన్, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు గురించి పోలీసుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏసీజీ-ఏ మైదానంలోకి మాత్రమే ప్రేక్షకులను అనుమతిస్తారు. ఇందులో ప్రధానంగా పీఎంఓపీ గ్యాలరీలోకి ప్లేయర్లు తప్పా ఎవరూ అటువైపు వెళ్లకుండా నిషేధించారు. ఇక బ్లాక్ ఏ, బీ గ్యాలరీల్లో వీఐపీలు, ప్రజాప్రతినిధులు, బీసీసీఐ ప్రతినిధులకు ఏర్పాట్లు చేశారు. ఇక బ్లాక్ సీ, డీ, ఈ, ఎఫ్ గ్యాలరీల్లో ప్రేక్షకులు, విద్యార్థులకు అనుమతించారు. గేట్-1 నుంచి బ్లాక్ సీ, డీ, ఈ, ఎఫ్ గ్యాలరీలకు వెళ్లే ప్రేక్షకులకు ప్రవేశం ఉంటుంది. క్రీడాకారులు, వీఐపీలకు గేట్-2 నుంచి ప్రవేశం కల్పించారు. గేట్-3 నుంచి ఆర్డీటీ సిబ్బంది, నిర్వాహక సిబ్బందికి అనుమతి ఉంటుంది. కార్యక్రమంలో మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ మహిళా జట్టు ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగారెడ్డి, ఏసీఏ లాజిస్టిక్ మేనేజర్ గౌరీశంకర్, అడ్మిన్ మేనేజర్ ఆదిత్యవర్మ, మీడియా మేనేజర్ రాజగోపాల్, రాహుల్ పాల్గొన్నారు.



ప్రాక్టీస్ దృశ్యాలు

విద్యార్థులపై రసాయనం స్ప్రే



ఆస్పత్రిలో పిల్లలను పరీక్షిస్తున్న వైద్యాధికారి హరి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 11: సోమందేపల్లిలోని సాయినగర్ ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో ఉన్న విద్యార్థులపై బుధవారం గుర్తుతెలియని బాలుడు కిటికీలోంచి రసాయనాన్ని స్ప్రే చేసి, పరారయ్యాడు. దీంతో విద్యార్థులు కళ్లమంట, నొప్పితో విలవిల్లాడారు. ఉపాధ్యాయులు వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారి హరికుమార్ వారిని పరీక్షించి, కళ్లకు ప్రమాదం లేదనీ, ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవన్ పాఠశాలలో ఆరాతీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్థానిక విద్యాశాఖాధికారులు, తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఆ బాలుడు ఎవరు, రసాయనాన్ని ఎందుకు స్ప్రే చేశాడన్న విషయాలు తెలియరాలేదు.

ధర్మవరంలో రియల్టర్ ఆత్మహత్య

కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేకే..



రజనీబాబు (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 11: ఒక్కగానొక్క కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేక పట్టణంలోని ప్రియాంకనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రజనీబాబు (50) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... రజనీబాబు, రామాంజినమ్మ దంపతులకు కుమారుడు నిశాంత్, కుమార్తె ఉండేవారు. రామాంజినమ్మ అగళి పీహెచ్‌సీలో నర్సుగా పని చేస్తున్నారు. కుమార్తెకు వివాహం చేశారు. నిశాంత్ తొమ్మిదో తరగతి చదువుతుండేవాడు. ఒక్కడే కొడుకు కావడంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. నిశాంత్ గతేడాది వినాయక చవితి పండుగ రోజే ఈతకు వెళ్లి, నీట మునిగి మరణించాడు. కుమారుడి మరణాన్ని రజనీబాబు జీర్ణంచుకోలేకపోయాడు. కుమారుడిని తలచుకుని, తీవ్ర ఆవేదన చెందుతుండేవాడు. మళ్లీ గణేశ్ పండుగ వచ్చింది. అంతటా సంబరాలు చేసుకుంటున్నారు. రజనీబాబుకు మాత్రం చనిపోయిన కుమారుడే గుర్తుకొచ్చాడు. బిడ్డను తలచుకుని తీవ్రంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. కాసేపటికి స్థానికులు గమనించి, వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గతేడాది కుమారుడిని, ప్రస్తుతం భర్తను కోల్పోయిన రామాంజినమ్మ కన్నీటి పర్యంతమైంది. ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ఏఐసీసీ పరిశీలకుడిగా సలీం అహ్మద్

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ పరిశీలకులుగా విధానపరిషత్ చీఫ్ విప్ సలీం అహ్మద్‌ను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలోని రాయఘడ లోక్‌సభ నియోజకవర్గం ఏఐసీసీ పరిశీలకులుగా నియమించారు. రానున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాయఘడ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు ఆయన పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. పార్టీ ప్రగతి, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాలను ఆయన పర్యవేక్షించనున్నారు. కాగా మహారాష్ట్రలోని బీవండి లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు పరిశీలకులుగా ఎమ్మెల్సీ ఐవాన్ డిసౌజాను నియమించారు. ఈయన కేరళ, గోవా రాష్ట్రాలకు లోక్‌సభ అభ్యర్థుల స్క్రీనింగ్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించిన సంగతి విదితమే.

హత్య కేసు నిందితుడు జైల్లో నిరాహారదీక్ష

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉడుపి నగరంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడైన ప్రవీణ్ అరుణ్ చౌగులె బెంగళూరు పరప్పన అగ్రహారజైలులో నిరాహార దీక్ష చేపట్టాడు. ప్రత్యేక సెల్ నుంచి సాధారణ సెల్‌కు మార్పు చేయాలని డిమాండ్ పెట్టినట్టు సమాచారం. 2023 నవంబరు 12న ఉడుపిలోని నేజార సమీపంలోని త్రిపాఠినగర్‌లో హసీనా, అఫ్నాన్, ఐనాజ్, అసీమ్ అనే నలుగురిని దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఉడుపి కోర్టులో కేసు కొనసాగుతోంది. కేసును బెంగళూరు కోర్టుకు మార్పు చేయాలని, ప్రత్యేక సెల్‌నుంచి సాధారణ సెల్‌కు బదిలీ చేయాలని ఆహారం తీసుకోకుండా నిరసనకు దిగాడు. ఈ మేరకు జైలు అధికారులు బుధవారం చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.

ఆరోగ్యానికి నిద్ర ముఖ్యం

బెంగళూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఆరోగ్యానికి తగినంత నిద్ర ముఖ్యమని అందుకు తగిన వాతావరణంతోపాటు పడకలు అవసరమని సీలి ఇండియా సంస్థ జీఎం జగన్నాథ్ అభిప్రాయపడ్డారు. కోరమంగలలో స్లీప్ గ్యాలరీని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగటివేళల్లో మీ విజయానికి రాత్రి నిద్ర కీలకం కానుందన్నారు. దశాబ్ద కాలంలోనే మ్యాట్రెస్ రంగంలో ఆధునాతన విధానాలు వచ్చాయన్నారు. వాటికి అనుగుణంగా ప్రజలు అలవాటు పడ్డారన్నారు. సీలి కంపెనీ అంతర్జాతీయ ప్రమాణాలతో మ్యాట్రెస్ రూపొందిస్తోందన్నారు. ప్రపంచంలో నెంబరువన్ కంపెనీగా కొనసాగుతోందని 1881 లో టెక్సాస్‌లో ఆరంభించామన్నారు. 2012లో సీలి ఇంటర్నేషనల్ వెంచర్‌ను ప్రారంభించామన్నారు. బెంగళూరు నగరం ప్రముఖమైనది కావడంతో ఇక్కడ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు.

ధర్మవరం పోదాం.. నకిలీ నోట్లు తెచ్చుకుందాం..

- ఇరువురి సంభాషణ ఆడియో వైరల్
- పోలీసులు అప్రమత్తం
- నిందితుల విచారణ ?

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 11: ధర్మవరం వెళ్లి నకిలీ కరెన్సీ తెచ్చుకుని, చెలామణి చేసుకుందామని ఓ డ్రైవర్.. మరొకరితో మాట్లాడిన ఫోన్ సంభాషణ ఆడియో వైరల్ అవుతోంది. రూ.50వేలు ఒరిజినల్ నగదుకు రూ.2 లక్షల నకిలీ నోట్లు ఇస్తారని అందులో పేర్కొన్నాడు. ఈ వ్యవహారంలో ఓ కానిస్టేబుల్ సహకారం అందిస్తాడని చెప్పడంతో పోలీసు యంత్రాంగం ఉలిక్కిపడింది. నిందితులను పెనుకొండ సర్కిల్ పోలీసు స్టేషన్‌కు తరలించి, విచారిస్తున్నట్లు తెలిసింది. పెనుకొండ వాసి సయ్యద్ మన్సూర్, సోమందేపల్లికి చెందిన డ్రైవర్ మంజునాథ్ ఫోన్‌లో నకిలీ కరెన్సీ చలామణిపై మాట్లాడుకున్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. డ్రైవర్ మంజునాథ్.. సయ్యద్ మన్సూర్‌కు ఫోన్ చేశాడు. రూ.50వేలు ఒరిజినల్ నగదు ఇస్తే రూ.2లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లు ఇస్తారని చెప్పాడు. ధర్మవరం పరిసర ప్రాంతాలకు వెళ్తే వారే వచ్చి రూ.2లక్షల నకిలీ నోట్లు ఇస్తారని తెలిపాడు. మొన్న ధర్మవరంలో తెచ్చిన నకిలీనోట్లను వైన్‌షాపులో, ఇంటి అద్దె చెల్లించేందుకు, బ్యాంకులో కూడా మార్చానని చెప్పుకొచ్చాడు. ఒరిజినల్ కరెన్సీ ఎలా ఉంటుందో అచ్చం అలాగే ఉంటుందని వివరించాడు. ధర్మవరం రూరల్‌లో నాగేష్ అనే కానిస్టేబుల్ ఉంటాడనీ, ఇలాంటి వాటికి సహకరిస్తాడని మాట్లాడుకున్న ఆడియో వైరల్ అయింది. దీనిపై అప్రమత్తమైన పోలీసులు మంజునాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పెనుకొండ సీఐ రాఘవన్‌ను అడగ్గా.. సోమందేపల్లికి చెందిన మంజునాథ్‌ను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిపారు.

రేపు ట్రాఫిక్ మళ్లింపు: డీఎస్పీ

హిందూపురం, సెప్టెంబరు 11: గణేష్ నిమజ్జనం సందర్భంగా హిందూపురంలో శుక్రవారం ట్రాఫిక్‌కు మళ్లించామని డీఎస్పీ మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు వైపు నుంచి అనంతపురం, మడకశిర, పెనుకొండకు వెళ్లే వాహనాలు ఆటో నగర్, రహమత్‌పురం సర్కిల్, లేపాక్షి రోడ్డు మీదుగా వెళ్లాలి. మడకశిర వైపు వెళ్లే వాహనాలుంటే హైవే మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. మడకశిర నుంచి వచ్చే వాహనాలు ఆర్టీసీ బస్సులు సేవామందిరం క్రాస్ వరకే అనుమతిస్తామన్నారు. అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లాల్సి ఉంటుందన్నారు. లేపాక్షి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులకు హైవేమీదుగా కొట్నూరు వరకు అనుమతి ఉందన్నారు. గోరంట్ల వైపు నుంచి వచ్చే వాహనాలను కొట్నూరు క్రాస్‌వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు.